క్లుప్తంగా

13న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని ఈ నెల 13వ తేదీ గురువారం లెక్కించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ప్రధాన హుండీతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఈ లెక్కింపు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నారాయణవనం: పాలమంగళం ఉత్తరపుకండ్రిగలోని పాలీశ్వరసామి ఆలయ నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారి సమేత పాలీశ్వరస్వామి గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. రూ. 6 లక్షలతో ధ్వజస్తంభ ఏర్పాటుకు దాత విరాళం అందించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన అనంతరం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. అనంతరం అలంకరించిన ఉత్సవర్లను ఊరేగించారు. సాయంత్రం భజనల మధ్య ఊంజల్ సేవ నిర్వహించారు.

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు

బుచ్చినాయుడుకండ్రిగ: గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న ఎస్ఐ విశ్వనాథనాయుడును శుక్రవారం పోలీసు స్టేషన్‌లో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సత్కరించి సన్మానించారు. విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలను ఆయన కొనియాడారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

రేణిగుంట(ఏర్పేడు): బహిరంగ ప్రదేశాలల్లో ఎవరైనా మద్యం తాగితే శిక్ష తప్పదని ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరించారు. మండలంలోని కోబాక సమీపంలో బహిరంగంగా మద్యం తాగే ప్రదేశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో మందు బాటిళ్లు, వాటర్ బాటిళ్లు, చెత్తను శుభ్రం చేయించారు.

అతివేగం అనర్థదాయకం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నాయుడు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీసిటీలో ఇసుజు పరిశ్రమకు చెందిన వాహన డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్దేశించిన వేగంతోనే వాహనాలు నడపాలని, అతివేగం అనర్థాలకు దారి తీస్తుందని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట పరంగా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇసుజు పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రదీప్ పాల్గొన్నారు.

రాచర్లలో వైఎస్సార్‌సీపీ నేత ఆకస్మిక మృతి


శంకరయ్య (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తొండా శంకరయ్య అలియాస్ పాలు (48) శుక్రవారం ఆకస్మిక మృతి చెందాడు. పంచాయతీలో కీలకంగా వ్యవహరించే యువ నాయకుడు మృతి చెందడంపై సత్యవేడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు బందిల సురేష్, స్థానిక ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి హరి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నాలు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మాడ వీధుల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దుకాణదారులను కోరారు. శుక్రవారం ఆయన మాడవీధుల్లో తిరుగుతూ దుకాణదారులతో మాట్లాడారు. మహాశివ రాత్రి ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో వాహనసేవలు, రథోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అందుకు రోడ్డు విస్తరణకు దుకాణదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

రేణిగుంట: పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించి తగిన అవకాశాలను కల్పించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా కార్యదర్శి చంద్ర వరప్రసాద్ చౌదరి కోరారు. శ్రీకాళహస్తి మండలం వెలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని దివ్య, పదో తరగతి విద్యార్థి సుబ్రహ్మణ్యం జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక కావడంతో శుక్రవారం ఆయన పాఠశాల ఆవరణలో వారికి ప్రోత్సాహకంగా ఆర్థిక సాయం అందజేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ఈనెల 10 నుంచి 13 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు వీరికి తన వంతు సాయం చేసినట్లు తెలిపారు. పాఠశాల పీడీ ప్రసాద్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. హెచ్ఎం మునిరేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు



కొత్త పింఛన్‌ల కోసం వృద్ధులు, వితంతువులు నెలల తరబడి ఆశగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతికి ఇస్తామని దరఖాస్తులు తీసుకున్నారు. కానీ సంక్రాంతి గడువు పోయినా కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. పింఛన్ల మీదే ఆధారపడే జీవించే పేదలు పింఛన్ మంజూరు కాక నాలుగేళ్లు నోటికాడికి పోవడంలేదు. ప్రభుత్వం ఆర్భాటంగా సంక్రాంతికి కొత్త పింఛన్‌లు ఇస్తామని హామీలు ఇచ్చి చేతులు దులుపుకోవడంపై వృద్ధులు, వితంతులు మండిపడుతున్నారు.

- ఏడు నెలలు పూర్తయినా మంజూరు కాని వైనం
- నిరాశలో వృద్ధులు, వితంతువులు
- కొత్త దరఖాస్తులకు మోక్షం కలిగేనా!

వరదయ్యపాళెం: చాలా మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్లే ఆధారం. ఒకటో తేదీ కోసం వీరంతా ఆశగాఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లను రూ.3 వేలు పెంచి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్ నగదు రూ. 4 వేలకు పెంచింది. అయితే కొత్తగా పింఛన్లు ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు పూర్తయినా కనీసం దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం లేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

నవంబర్‌లో కొత్త జీఓ

కూటమి ప్రభుత్వం నవంబర్ నెలలో కొత్త జీఓ తీసుకొచ్చింది. నవంబర్ నెలలో ఒకటి నుంచి 15వ తేదీలోగా పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే మరుసటి నెల నుంచి భార్యకు పింఛన్ అందజేయాలని జీఓలో పేర్కొంది. 15 నుంచి 31వ తేదీ లోగా చనిపోతే నెల విడిచి మరో నెలలో పింఛన్ అందజేయాలని ఆ జీఓలో పేర్కొంది. ఈ నిర్ణయంతో చాలా మంది అర్హులు పింఛన్లకు దూరమయ్యారు.

60 ఏళ్లు దాటినా వారిది అదే పరిస్థితి

60 ఏళ్లు దాటిన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 60 ఏళ్లు దాటినవారు సుమారు 650 మందికి పైగా ఉన్నారు. అలాగే భర్తలను కోల్పోయిన వితంతువులు సైతం 400 మందికి పైగా ఉన్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి నూతన పింఛన్లు అందజేస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి కొత్త పింఛన్లు అందుతాయని ఆశ పడిన వారికి ఎదురు చూపులే మిగిలాయి.

50 ఏళ్ల వారికి ఎప్పుడో?

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రధాన హామీ వెనుకబడిన తరగతులకు చెందిన 50 ఏళ్లు పూర్తయిన వారికి పింఛన్లు అందజేస్తామని హామీ ఇచ్చింది. దీంతో చాలా మంది నిజమేనని నమ్మారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు దాటినా దీని గురించి కనీస ప్రస్తావన లేక పోవడంతో అర్హులు సర్కారు తీరును తప్పుబడుతున్నారు.

జీవనం ప్రశ్నార్థకంగా మారింది



నా భర్త 10 నెలల కిందట చనిపోయాడు. రెక్కాడితే గానీ డొక్కాడని గిరిజన కుటుంబం నాది. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన నాకు జీవనం ప్రశ్నార్థకంగా మారింది. అయితే ప్రభుత్వం నుంచి వితంతువు పింఛన్ వస్తుందని ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నా. ఇప్పటివరకు పింఛన్ మంజూరుకాలేదు.

–గంగమ్మ, కాంపాళెం గిరిజనకాలనీ, బీఎన్‌కండ్రిగ మండలం

దరఖాస్తు చేసుకున్నా రాలేదు..



కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాను. నా భర్త చనిపోయి సంవత్సరం కావస్తోంది. ఎన్నికల ముందు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఎన్నికల కోడ్ కారణంగా ఆ సమయంలో నూతన పింఛన్ మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇంకా పింఛన్ మంజూరుకాక ఇబ్బందిపడుతున్నా. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

–మునెమ్మ, బీఎన్‌కండ్రిగ గిరిజనకాలనీ

నిర్లక్ష్యం మంచిది కాదు..



నా వయసు 60 ఏళ్లు పైబడింది. వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అక్కడ సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. పింఛనే ఆధారంగా జీవించే మాలాంటి వృద్ధులకు పింఛన్ మంజూరు చేయడంలో ఇంతటి నిర్లక్ష్యం వహించడం మంచిది కాదు.

– కస్తూరి, నాగలాపురం

హామీ అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. దీన్ని తక్షణమే అమలు చేయాలి. 50 ఏళ్లు దాటిన వారు పింఛన్ కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. పింఛన్ల మంజూరులో నిర్లక్ష్యం చూపితే ప్రజాగ్రహం చూస్తారు.

–రవి, వెంగారెడ్డికండ్రిగ

పార్కు స్థలాన్ని సంతకు కేటాయించండి

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని పాత పార్కు (వాటర్ ట్యాంకు షెడ్డు) స్థలాన్ని నూతనంగా సంత ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని సర్పంచ్ మంజుల, కార్యదర్శిముని రవికుమార్ ఎమ్మెల్యేను కోరారు. ఏడేళ్లుగా నిర్వహిస్తున్న సంత స్థలంలో టీటీడీ కల్యాణ మండపం ఏర్పాటు చేస్తుండడంతో సంత నిర్వహణకు స్థలం లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న పాత పార్కు స్థలాన్ని సంతకు కేటాయించాలని అధికారులు ఎమ్మెల్యేను కోరారు. స్థలానికి అవసరమైన అనుమతులు తెలుగుగంగ అధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి సంతకు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, వార్డు సభ్యులు , పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుకాణాదారులు సహకరించాలి


వేయింగ్ మిషన్ పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వర్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట పట్టణంలో శుక్రవారం తిరుపతి తూనికలు, కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వర్ సిబ్బందితో దుకాణాలు తనిఖీ చేశారు. దుకాణాల్లో వేయింగ్ మిషన్లు, తూకం రాళ్లు, ముందుగా తీసుకున్న ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వర్ మాట్లాడుతూ.. వేయింగ్ మిషన్లు వాడే ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆరు నెలలకు ఒకసారి వేయింగ్ మిషన్ లను పరిశీలించి సీల్ వేయించుకోవాలని లేకుంటే జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూనికలు కొలతల విభాగం అధికారులు గజేంద్ర నాయుడు, రమేష్, పెదబాబు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా


మర్రిగుంట సర్కిల్లో బోల్తా పడిన లారీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం మర్రిగుంట నూతన కూడలిలో శుక్రవారం తెల్లవారుజామున నెల్లూరు వైపు వెళ్లే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సర్కిల్ ఏర్పడినప్పటి నుంచి వరుస ప్రమాదాలు జరగడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సర్కిల్‌లోనే ఆర్టీఓ అధికారులు తనిఖీ నిమిత్తం వాహనాలను ఆపడంతో భారీ వాహనాలు సర్కిల్ పరిసరాల్లో పార్కింగ్ చేస్తున్నారు. కొత్త సర్కిల్ కావడం భారీ వాహనాలు ఉండడం కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 44వ వార్షికోత్సవం, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీలత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ప్రిన్సిపల్ సుబ్బారావు, చెంగల్‌రాయులు, మండల విద్యాశాఖ అధికారి బాబయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్య పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని కోరారు. రాబోయే వార్షిక పరీక్షలకు చక్కగా ప్రిపేర్ అయ్యి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్య క్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ దేవేంద్ర, రెడ్డప్ప, వేలాయుదం పాల్గొన్నారు.

ఊంజల్‌సేవలో పద్మావతీ అమ్మవారు


ఊయల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పద్మావతీ అమ్మవారిని ఊంజల సేవలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు మండపంలో ఊయల సేవలో సేద తీరారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య బృందం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం


సర్వే పత్రాలను పరిశీలిస్తున్న అరుణకుమార్

బుచ్చినాయుడుకండ్రిగ: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వేయర్ అరుణకుమార్ తెలిపారు. శుక్రవారం కుమారవెంకటాపురంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా అధికారులు చేపట్టిన భూముల రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ సర్వేతో భూ వివాదాలు పరిష్కారం అవుతాయని, సర్వే రైతులకు వరమని సహకరించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో వారి భూముల వద్ద సర్వే సిబ్బంది చేరుకుని వివరాలు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారని తెలిపారు. భూ కొలతలు పక్కాగా ఉండేలా హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. సర్వే అధికారులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్‌రావు, ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజకుమార్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం కుటుంబానికి భరోసా


నివాళి అర్పిస్తున్న పార్టీ నాయకులు

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం మృతికి పలువురు నాయకులు నివాళి అర్పించారు. మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ దళితవాడకు చెందిన సుబ్రహ్మణ్యం (52) గురువారం మృతి చెందారు. శుక్రవారం ఉదయం పార్టీ జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, సర్పంచ్ మురళి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్, పార్టీ నాయకులు పీజీ బాబు, అశోక్ తదితరులు సుబ్రహ్మణ్యం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇళ్ల కూల్చివేత దుర్మార్గం

శ్రీకాళహస్తి రూరల్(రేణిగుంట): రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ ఏఎస్‌ఆర్ కాలనీలోని శికారీల ఇళ్లను అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు బలవంతంగా కూల్చివేయటం దారుణమని ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్ విచారం వ్యక్తం చేశారు. రేణిగుంట రైల్వే లైన్ విస్తరణకు చేపట్టిన భూసేకరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న 52 మంది బాధితులకు 2013 చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, ఇంటి స్థలంతో పాటు ప్రభుత్వమే హౌసింగ్ ఇల్లు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రమాదేవి ట్రస్టు సేవలు అభినందనీయం


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి: రమాదేవి చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లో రమా చారిటబుల్ ట్రస్టు శాఖను డీఎస్పీ నరసింహమూర్తి, తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు ప్రారంభించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రస్టు సేవలు శ్రీకాళహస్తిలో ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సుమలత, కోశాధికారి పరమేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

స్వామి అమ్మవార్ల పుర ఉత్సవం

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి పుర ఉత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్లతో పాటు శ్రీవల్లి దేవసేన సమేత చెంగల్వరాయస్వామి బాబు అగ్రహారం కోనేరు మీదుగా కుమారస్వామి ఆలయానికి చేరుకుని అక్కడి నుంచి తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయానికి చేరుకుంటారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా 33/11కేవీ సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాసుకుప్ప ఉపకేంద్రం పరిధిలో..

సత్యవేడు: దాసుకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సబ్ ఇంజినీర్ రవి తెలిపారు. మండలంలోని దాసుకుప్పం, సురుటుపల్లి, చెన్నేరి, పుదుకుప్పం, సీతారాంపేట, ఆంబాకం, మదనంజేరి, తొండుకుల్లి ప్రాంతాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నాగలాపురంలో విద్యుత్ అంతరాయం

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ, బీరకుప్పం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ రమేష్ చంద్ర తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ , మరమ్మతు పనులు కారణంగా విద్యుత్ అంతరాయం నిలిపివేసినట్లు తెలిపారు.

రేణిగుంట రూరల్ పరిధిలో

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని 33/11 కేవీ తుకివాకం 33/11 కేవీ, కరకంబాడి 33/11 కేవీ, గురవరాజుపల్లి 33/11 కేవీ , ఎల్లమండ్యం 33/11 కేవీ , గాజులమండ్యం 33/11 కేవీ , కుక్ర కాలువ సబ్ స్టేషన్ల పరిధిలోని 11 కేవీ లైన్లు, ఎల్‌టీలైన్లు, ట్రాన్స్‌ఫార్మర్, చెట్ల కటింగ్‌లో భాగంగా విద్యుత్ లైన్లకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించుట, నిర్వహణ కోసం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బాబు తెలిపారు.

నీటి ప్రవాహానికి అడ్డుకట్ట


ఎర్ర చెరువు కాలువ పూడికను జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

నాగలాపురం: స్థానిక ఎర్ర చెరువుకు సమీపంలో చెల్లేతమ్మ ఆలయానికి ఎదురుగా పల్లాపు తూము మరమ్మతులకు గురికావడంతో నీరు భారీగా లీకేజీ అయి బీసీ కాలనీలోని వీధుల మీదుగా ప్రవహిస్తోందని లీకేజీలతో అగచాట్లు అనే కథనం 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైంది. ఈ మేరకు సర్పంచ్ చిన్నదొరై సుధా ఎర్ర చెరువు వద్ద పూడికతో నిండిన కాలువను జేసీబీతో శుభ్రం చేశారు. బీసీ కాలనీలోకి వస్తున్న నీటి కాలువకు మట్టితో ఎత్తైన కట్ట వేసి నీటి ప్రవాహాన్ని ఆపారు. కాలువ పూడిక చేపట్టి అడ్డుకట్ట వేయడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో బీసీ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణ మండపం పనులు వేగవంతం చేయండి

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలోని సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులను ఆదేశించారు. గుత్తేదారుతో ఫోనులో మాట్లాడారు. శుక్రవారం సంత స్థలంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం చేపట్టిన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. గురువారం సాక్షి దినపత్రికలో 'కల్యాణ భాగ్యం కలేనా!' కథనం ప్రచురితం అయింది. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. శుక్రవారం మండల అధికారులు, తెలుగు గంగ అధికారులు గుత్తేదారులతో కలసి టీటీడీ కల్యాణ మండపం పనులు వేగవంతం చేయాలని కోరారు. కల్యాణ మండపం పునాదుల్లో ఉన్న తాగునీటి పైపులైన్‌లను తొలగించి వేరేచోటకు మార్చాలని సర్పంచ్ పి.మంజుల, కార్యదర్శి మునిరవికుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగు గంగ డీఈ శీహరి, తహసీల్దారు సుబ్రమణ్యం, ఎంపీడీఓ చంద్రశేఖర్, నాయకులు పరమశివం(బాషా), మురళి(చిన్నా) ప్రభాకర్ రెడ్డి, సుబ్రమణ్యం రాజు, రమణయ్య పాల్గొన్నారు.

రక్షణ కంచె ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సిబ్బంది రక్షణ కంచె ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయంటూ 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ జయప్రకాష్ .. సిబ్బందితో ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు టీచర్‌ను కొనసాగించండి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం, సాంబయ్యపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణయ్యపై కొన్ని రోజులుగా అదే పాఠశాలలో 7వ తరగతి చదవుతున్న ఓ విద్యార్థిని తనతో అసభ్యకరంగా మాట్లాడారని తప్పుడు ప్రచారం చేయడంతో ఉన్నతాధికారులు కృష్ణయ్యను సస్పెండ్ చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో పాఠశాల వద్ద సస్పెండ్ తొలగించాలని నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ భారతి అక్కడికి చేరుకుని మాట్లాడారు. డీఈఓకు లేఖ రాస్తానని చెప్పడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో కోగిలి మునిచందు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సలహా సంఘం ఎన్నిక

సత్యవేడు: స్థానిక కమ్యూనిటీ వైద్యశాల చైర్మన్‌గా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సలహా సంఘం సభ్యులుగా హేమభూషణం, శోభ, దినేష్‌కుమార్ ఎన్నిక కావడంతో వారితో ప్రమాణోత్సవం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు వైద్యశాల అభివృద్ధి , రోగుల వసతికి నిరంతరం సేవలందించాలని సూచించారు. వైద్యశాలలో డెలివరీ కేసులు పెంచాలని కోరారు. కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న గైనకాలజిస్టు పోస్టు భర్తీ చేయాలని కలెక్టర్‌ను కోరానన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని వైద్యశాలలో 108 వాహనం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోజు వారి ఓపీ 500కు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీసిటీలోని కంపెనీలు అందించిన అంబులెన్సు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమం డాక్టర్ సురేష్, వీకేఎస్ పరమశివం, మాజీ జడ్పీటీసీ కే. సుందరామిరెడ్డి, రాధయ్య, మురలి, పరందామ నాయుడు, శివానందం, సుబ్రమణ్యం రాజు, శశిమోహన్, సురేంద్ర, ప్రభాకర్ రెడ్డి, డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.

వారపు సంత సముదాయం ప్రారంభం

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం ముసలిపేడులో నాబార్డు నిధులతో నిర్మించిన వారపు సంత సముదాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి ప్రారంభించారు. ప్రజలు సంతను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పొన్నారావు, పేరం నాగరాజునాయుడు, ప్రగతి డైరెక్టర్ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.